వరి మాసూళ్లకు కష్టాలు


పెనుమంట్ర - పాలమూరు సరిహద్దు పొలాలకు వెళ్లే పుంత దారి


ఊబిలో కూరుకుపోయిన ధాన్యం ట్రక్కును పైకిలాగేస్తున్న దృశ్యం


పంట పొలాల వద్ద ప్రధాన రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యం

- ధాన్యం రవాణాకు అవస్థలు
- మట్టి పుంతలు గోతులమయం
- రైతుల ఆవేదన

పెనుమంట్ర: పెనుమంట్ర మండలంలో అనేక గ్రామాల్లో పంట పొలాలకు వెళ్లే మట్టి పుంతల దారులు గోతులమయం కావడంతో వర్షాకాలంలో సార్వా సాగుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వరి మాసూళ్లు, ధాన్యం రవాణాకు అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారు. మండలంలో 18 గ్రామాలకు చెందిన 6,800 మందికిపైగా రైతులు 12 వేల ఎకరాల్లో వరిసాగు, 1300 మందిపైగా రైతులు మూడు వేల ఎకరాలలో ఆక్వాసాగు చేస్తున్నారు. ప్రతి పంటకూ 34 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం పండిస్తున్నారు. చేల నుంచి పండిన ధాన్యాన్ని పుంత రహదారుల నుంచి ప్రధాన రహదారికి చేర్చి ఆరుదల చేసిన అనంతరం రైతులు రైస్ మిల్లులకు చేర్చే వరకు రైతులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మిషన్ కోతల ద్వారా మాసూళ్లు చేసిన ధాన్యాన్ని కూలీలు ట్రాక్టర్ల సాయంతో రోడ్లకు చేర్చే సమయంలో రైతులు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. ఆర్థికంగా నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ సాగు చేయాలంటే భయపడిపోతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పరిహారాలు అందుకున్న కౌలు రైతులు నేటి కూటమి ప్రభుత్వం నుంచి సరైన పరిహారాలు అందక వరిసాగుపై విరక్తి చెంది భూములను వదిలివేసే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఎస్ ఇల్లిందలపర్రు, వెలగలవారిపాలెం, మాముడూరు, పాలమూరు, భట్ల మగుటూరు, నెలమూరు, కొయ్యేటిపాడు, సత్యవరం గ్రామాల్లోని పుంత దారులను గ్రావెల్‌లో అభివృద్ధి చేయాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

వృథా ఖర్చులు



వరిసాగు చేసే సమయంలో వర్షాకాలంలో ధాన్యం మాసూళ్లకు ఇబ్బందులు పడుతున్నాం. పుంతల్లో రహదారి సౌకర్యాలు సక్రమంగా లేవు. కూలీలతో వాహనాలపై ధాన్యం తరలింపునకు అధిక ఖర్చు చేయాల్సి వస్తుంది. దీంతో కౌలు రైతు నష్టపోతున్నారు.

– తుమ్మిడి రామారావు, కౌలు రైతు, పాలమూరు

భక్తిశ్రద్ధలతో కార్తీక సోమవారం పూజలు

నరసాపురం: కార్తీకమాసం సోమవారం పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి పట్టణంలో శివాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. వశిష్టగోదావరి వలంధర్ రేవులో వేకుల జాము నుంచే భక్తులు నదిలో పుణ్యస్నానాలు చేశారు. గోదావరిలో దీపాలు వదిలారు. రేవులో పరమశివుడి విగ్రహానికి పూజలు చేశారు. కపిలమల్లేశ్వర స్వామి ఆలయం, గోదావరి గట్టున ఉన్న అమరేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడాయి. 12వ వార్డులో ఏకాంరేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. తెల్లవారుజాము నుంచే గోదావరి ఘాట్ల వద్ద, శివాలయాల వద్ద భక్తుల రద్దీ నెలకొంది.


వలందర్‌రేవులో దీపాలు వదులుతున్న భక్తులు


గోదావరి తీరాన పరమశివుడి విగ్రహానికి పూజ చేస్తున్న భక్తులు


కిటకిటలాడిన శివాలయాలు

మొగల్తూరు: కార్తీకమాసం రెండో సోమవారం శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ముత్యాలపల్లి గ్రామంలోని భువనేశ్వరీ సమేత ముక్తేశ్వర స్వామి, పేరుపాలెం చంద్రమౌళీశ్వర స్వామి, కాళీపట్నం కాళీకేశ్వరస్వామి, మొగల్తూరులోని పురాతన పార్వతీ విశ్వేశ్వరస్వామి, వనమల్లికార్జున స్వామి ఆలయాల్లో అభిషేకాలు నిర్వహించారు. మొగల్తూరు శివాలయంలో అర్చకులు కొత్తలంక బాపన్న, గంగ పవన్ నేత్రత్వంలో శివలింగానికి అభిషేకాలు చేశారు. ఆలయ ధ్వజస్తంభం, ఉసిరి చెట్టు వద్ద దీపాలు వెలిగించుకున్నారు.

ఆలయాల్లో వెల్లువిరిసిన కార్తిక శోభ.

నరసాపురం రూరల్: మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. లక్ష్మణేశ్వరం రేవులోని వశిష్ఠ గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు. రేవు ఆవరణంలో మహిళలు అరటి డొప్పలలో ఆవునేతి ఒత్తులతో దీపాలు వెలిగించి గౌరీ మాతను పూజించి, గోదావరిలో వదిలారు. దుర్గాలక్ష్మణేశ్వర స్వామి ఆలయంలో అభిషేకాలు చేశారు. ధ్వజస్తంభం వద్ద ఆకాశ దీపానికి పూజలు నిర్వహించారు. పితానిమెరక గ్రామస్తులు అన్న సమారాధన ఏర్పాటుచేశారు.


ప్రత్యేక అలంకరణలో ఏకాంబరేశ్వరస్వామి


పెనుగొండ వాసవీ శాంతి థాంలో సంధ్యాహారతి

ఓం నమఃశివాయా

పెనుగొండ: కార్తీక సోమవారంతో శివాలయాలన్నీ ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లాయి. పెనుగొండ, ఆచంట మండలాల్లోని గోదావరి తీరంలో భక్తులు కార్తీక స్నానాలు ఆచరించారు. కేదారీఘాట్ మహిళలో నిండిపోయింది. పుణ్య స్నానాలు అనంతరం కార్తీక ధీపాలు వదలి కేదారేశ్వరుని దర్శించుకొన్నారు. వడలి అగస్త్యేశ్వర స్వామి, సిద్ధాంతం నందీశ్వర స్వామి, పెనుగొండ శ్రీనగరేశ్వర మహిషాసురమర్ధనీ వాసవీ కన్యకపరమేశ్వరి, అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలో వాసవీ శాంతి థాంలోనూ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం నగరేశ్వర స్వామికి సంధ్యాహరతి ఇచ్చారు.

పెనుమంట్ర మండలంలో..

పెనుమంట్ర: శివునికి ప్రతీకరమైన రోజు సోమవారం శైవక్షేత్రాలలో స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. కాశీ క్షేత్రాలతో సమానంగా ప్రసిద్ధిగాంచిన జుత్తిగ ఉమావాసుకి రవి సోమేశ్వరస్వామి, నత్తారామేశ్వరం రామలింగేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. జుత్తిగలోని సోమేశ్వరస్వామివారికి వివిధ పండ్ల రసాలతో అభిషేకాలు నిర్వహించారు. రామేశ్వరస్వామి వారికి క్షీరాభిషేకాలు చేశారు. భక్తులు ఆలయాల్లోని నంది, విగ్రహాల వద్ద దీపాలు వెలిగించి అభిషేకాల్లో పాల్గొన్నారు. అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు.


దుర్గాలక్ష్మణేశ్వరస్వామివారి ఆలయంలో అన్నసమారాధన


జుత్తిగ సోమేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకులు


జుత్తిగ సోమేశ్వరస్వామి ఆలయంలో నంది విగ్రహం వద్ద దీపాలు వెలిగించిన భక్తులు


సిద్ధాంతం కేదారీఘాట్‌లో కేదారేశ్వర స్వామి ఆలయం వద్ద భక్తుల కిటకిట

సోషల్ మీడియాతో అప్రమత్తంగా ఉండాలి

పెనుగొండ: సోషల్ మీడియాతో ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సీఐ రాయుడు విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం పెనుగొండ ఎస్వీకేపీ అండ్ పితాని వెంకన్న జూనియర్ కళాశాలలో సోషల్ మీడియాపై అవగాహన సదస్సు నిర్వహించారు. మనల్ని మనం కాపాడుకోవాలని, సోషల్ మీడియా వేధింపులకు చెక్ పెట్టడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. వాట్సప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగాం ట్వీట్టర్లతో జాగ్రత్తగా వ్యవహరించాల్సిన తీరును వివరించారు. గ్రూపు అడ్మిన్‌లు సైతం అప్రమత్తంగా ఉండాలని, లేదంటే శిక్షార్హులవుతారని హెచ్చరించారు. ద్వేషపూరితమైన ప్రసంగాలు, కుల, మత, వర్గాల మధ్య విబేధాలకు, విద్వేషాలకు దారి తీసే పోస్టులు పెట్టవద్దన్నారు. సోషల్ మీడియాలో ట్రోలింగ్ వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ఎస్సై కె.గంగాధర్, ప్రిన్సిపాల్ కొల్లి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న సీఐ విజయ్‌కుమార్

దర్భరేవు డ్రెయిన్‌పై రెగ్యులేటర్ నిర్మించాలి

మొగల్తూరు: దర్భరేవు డ్రెయిన్‌పై రెగ్యులేటర్ నిర్మించి తమను ఆదుకోవాలని కోరుతూ సోమవారం రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో రామన్నపాలెం సర్పంచ్, ఉపసర్పంచ్, రైతులు తహసీల్దార్ కె.రాజకిశోర్‌కు వినతిపత్రం అందజేశారు. మొగల్తూరు నుంచి ప్రవహించే దర్భరేవు డ్రెయిన్ ఆటుపోటులకు రామన్నపాలెం పంచాయతీ అడవిపర్ర ప్రాంతంలోని చేలల్లోకి నీరు చేరి ముంపునకు గురవుతున్నాయని, ఏడాది పొడవునా చేలల్లో నీరు ఉండిపోతుందని, దీంతో ఆర్థికంగా నష్టపోతున్నామని వివరించారు. ముంపు పోలాలను పరిశీలించిన నాటి టీడీపీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు, జిల్లా కలెక్టర్‌లు మొగల్తూరు పంచాయతీ కొత్తకాయలతిప్ప గ్రామం వద్ద రెగ్యులేటర్ నిర్మిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. రెగ్యులేటర్ నిర్మించకపోవడంతో ఈ ఏడాది సార్వా సాగు చేపట్టలేదని తెలిపారు. రెగ్యులేటర్ ఆవశ్యకతను వివరిస్తూ జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులకు, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు, ఎమ్మెల్యే నాయకర్‌కు వినతిపత్రాలు అందజేస్తామని వివరించారు. కార్యక్రమంలో రామన్నపాలెం గ్రామ సర్పంచ్ బందెల ఏలీషా, ఉపసర్పంచ్ మేకల పరుశురామ్, రైతులు ఆరేటి రాజా, అడ్డాల సాంబమూర్తి, ఆకన ఏడుకోండలు, తణుకులు నరేష్ తదితరులున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఎంపీడీఓ త్రిశూలపాణి, ఏఓ అబ్దుల్ రహీమ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న సర్పంచ్, రైతులు

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

నరసాపురం: లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్టు నిర్ధారణ ఐతే సంబంధిత స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ దాసి రాజు హెచ్చరించారు. సోమవారం తన చాంబర్‌లో లింగ నిర్ధారణ నివారణ సబ్ డివిజనల్ కమిటీ సమావేశం నిర్వహించారు. డివిజన్‌లోని స్కానింగ్ సెంటర్లపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని ఆర్డీఓ రాజు చెప్పారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, కమిటీ సభ్యులు తరచూ స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేయాలన్నారు. స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు నిర్ణీత గడువులో స్కానింగ్ సెంటర్లను రెన్యువల్ చేయించుకోవాలని సూచించారు. సమావేశంలో డీఎస్పీ మురళీకృష్ణ, కమిటీ కన్వీనర్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సీహెచ్ స్వరూప్, న్యాయ సలహాదారుడు చల్లా దానయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో దాసి రాజు

బాలల హక్కులపై అవగాహన

పాలకొల్లు అర్బన్: బాలల హక్కులపై అవగాహన కలిగి ఉండాలని బాలల సంరక్షణ విభాగం జిల్లా అధికారి బి.నెహెమ్యా అన్నారు. పాలకొల్లు మండలం శివదేవునిచిక్కాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం బాలల దత్తత మాసోత్సవాల్లో భాగంగా బాలల సంరక్షణ చట్టాలు, బాలల చట్టాలపై అవగాహన, బాలల జీవించే హక్కు, రక్షణ పొందే హక్కు తదితర అంశాలపై బాలలకు అవగాహన కల్పించారు. హెచ్ఎం పి.మూర్తి మాట్లాడుతూ బాలబాలికలకు రక్షణ కోసం రూపొందించిన చట్టాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు పి.విజయకుమారి, కె.సత్యశ్రీ, జీవీ కుమారి, కుసుమే రాణి, కౌన్సిలర్ సీహెచ్ సత్యనారాయణ, సోషల్ వర్కర్ కె.స్వర్ణలత పాల్గొన్నారు.

శబరిమలకు సైకిల్ యాత్ర


సైకిల్‌పై శబరిమలకు బయలుదేరిన అయ్యప్పలు

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు నుంచి సోమవారం పట్టణానికి చెందిన కండాపు శ్రీనివాసరావు గురుస్వామి ఆధ్వర్యంలో 18 మంది అయ్యప్ప స్వాములు శబరిమలకు సైకిల్‌పై బయలుదేరారు. గురుస్వామి శ్రీనివాసరావు మాట్లాడుతూ వేకులజామునే అయ్యప్పస్వామి ఆలయంలో ఇరుముళ్లు ధరించామన్నారు. సైకిల్‌పై శబరిమల రెండోసారి వెళుతున్నట్టు చెప్పారు. స్వామి సన్నిధికి చేరుకోవడానికి సుమారు 13 రోజులు సమయం పడుతుందని అన్నారు. యాత్రలో స్వాములు దుక్క రాజు, రఘుమండ శ్రవణకుమార్, ఏడిద సత్తిబాబు, పీతల శ్యామ్, రాగోలు వెంకన్న, లోత్తుపల్లి సునీల్ తదితరులు ఉన్నారు.

భారతీయ కిసాన్ సంఘ్ కమిటీల నియామకం

పాలకొల్లు అర్బన్: భారతీయ కిసాన్ సంఘ్ గ్రామ కమిటీలు నియమిస్తున్నట్టు జిల్లా అధ్యక్షుడు గంటా నాగరాజు చెప్పారు. పాలకొల్లు మండలం గవరపేటలో సోమవారం నిర్వహించిన కిసాన్ సంఘ్ సమావేశానికి ఆయన అధ్యక్షతవహించి మాట్లాడారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా బొడ్డేటి శ్రీనివాసరావు, కోశాధికారిగా బీసెట్టి నాగశ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా మల్ల మురళీకృష్ణలను నియమించారు. రైతులకు రాయితీలు కల్పించాలని తీర్మానించారు.

క్లుప్తంగా

కూరగాయల పంపిణీ


కూరగాయల స్టాల్ ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

మొగల్తూరు: రసాయనాలు లేకుండా జీవామృతం, కషాయాలు, ద్రావణాలు, బయోకల్చర్ వేసి పండించిన కూరగాయలు, ఆకు కూరలు తినడం వల్ల ఆరోగ్యకరంగా ఉండవచ్చని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది స్టాల్‌ను ఏర్పాటు చేసి మొగల్తూరు కుక్కలవారితోటలో పండించిన వంకాయ, బీరకాయ, దొండకాయ, బెండకాయ, ఆనపకాయ, తోటకూర తదితర కూరగాయలు, ఆకుకూరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కె.లక్ష్మీ కుమారి, ఆర్ పుష్ప, కె.మహాలక్ష్మీ, యు.కనకదుర్గా భవాని, ఎం దుర్గా భవాని, పి.రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా యానిమేటర్ల సమస్యలపై వినతి

పెనుమంట్ర: డ్వాక్రా యానిమేటర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం పెనుమంట్ర మండలానికి చెందిన డ్వాక్రా యానిమేటర్లు సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్, ఏపీఎంలకు తమ సమస్యలతో కూడిన వినతి పత్రాలను అందజేశారు. కాలపరిమితి సర్కులర్ రద్దు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించి, వేతన బకాయిలు చెల్లించాలని రాజకీయ నాయకుల ఒత్తిడిలను అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో యానిమేటర్ల సంఘ నాయకులు కొవ్వూరి రమ్య, మండ భాగ్యలక్ష్మి, బొక్కా విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌పై అనధికార కనెక్షన్ తొలగించండి

యలమంచిలి: తన పొలంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి తన అనుమతి లేకుండా మరో వ్యక్తి అతని చెరువుకు విద్యుత్ కనెక్షన్ తీసుకున్నారని బాడవ మాజీ సర్పంచ్ ఇలపకుర్తి నరసింహారావు (పండు) సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ గ్రంధి పవన్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్‌పై అధిక లోడు పడడంతో తనకు అదనపు విద్యుత్ బిల్లు వస్తుందని, అక్రమ కనెక్షన్‌ను వెంటనే తొలగించాలని పండు కోరారు.

రోడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలి

మొగల్తూరు: ఉపాధి హామీ పథకంలో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తిచేయాలని డ్వామా ఏపీడీ, మండల ప్రత్యేకాధికారి సుజాత ఆదేశించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి ఫీల్డ్, అసిస్టెంట్‌లు, అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. మినీ గోకులాలను ఎప్పకప్పుడు పర్యవేక్షించాలని, ఉపాధి కూలీలకు పనిదినాలు ఎక్కువ కల్పించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎంపీడీఓ సీహెచ్ త్రిశూల పాణి, టెక్నికల్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

శానిటరీ మహిళా కార్మికులకు అవమానం

పాలకొల్లు సెంట్రల్: 'మీకు ఇక్కడ కాదు నిత్యాన్నదానం సత్రంలోకి వెళ్లండని' ఆలయ సిబ్బంది ఒకరు చెప్పడంతో అవమానంతో మునిసిపల్ శానిటరీ మహిళా వర్కర్లు భోజనం చేయకుండానే వెళ్లిపోయారు. పంచారామ క్షేత్రం క్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయంలో సేవలందించే వివిధ శాఖలు, సేవా సంస్థలు, సిబ్బంది, శానిటరీ వర్కర్లకు ఆలయ కార్యాలయం వద్ద సోమవారం మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశారు. మునిసిపల్ శానిటరీ కార్మికులు ముగ్గురు భోజనానికి రాగా, భోజనం వడ్డిస్తున్న ఆలయ సిబ్బంది ఒకరు మీకు ఇక్కడ కాదు నిత్యాన్నదానం సత్రంలోకి వెళ్లండని పంపిచేశారు. అక్కడ క్యూలైను భారీగా ఉండడంతో.. అక్కడే ఉన్న ఓ వ్యక్తి వెళ్లి వారికి భోజనం పెట్టడానికి ఇబ్బంది ఏమిటని వడ్డించే వ్యక్తిని ప్రశ్నించారు. కావాలంటే టోకెన్లు ఇస్తాను అక్కడకెళ్లి చేయమనండని తెలిపారు. ఇంతలో అక్కడే భోజనం చేస్తున్న మరో దేవస్థానం అధికారి వారికి భోజనాలు ఇక్కడ పెట్టేయండని చెప్పగా ఇంతలో ఆ మహిళా కార్మికురాళ్లు ముగ్గురు భోజనానికి వచ్చారు. ఇక్కడ కాదన్నాను కదా అక్కడకు వెళ్లండని విసుక్కోవడంతో వారు కూటికి గతిలేక రాలేదయ్యా అని భోజనం చేయకుండానే వెనుతిరిగి వెళ్లిపోయారు.

క్షీరారామలింగేశ్వరస్వామి సేవలో అఘోర


క్షీరారామలింగేశ్వరస్వామిని దర్శించుకున్న అఘోర

పాలకొల్లు సెంట్రల్: క్షీరారామలింగేశ్వర స్వామిని అఘోర దర్శించుకుంది. సోమవారం రాత్రి ఆలయానికి విచ్చేసిన అఘోరాను ఆలయంలోకి ఆహ్వానించారు. నేరుగా స్వామివారి గర్భాలయం వద్దకు చేరుకుని స్వామివారిని దర్శించుకుని వెంటనే తిరిగి వెళ్లిపోయారు.

నేటి నుంచి శిక్షణా తరగతులు

నరసాపురం రూరల్: గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు, 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రణాళికలు తయారీపై శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ గాదిరాజు రామకృష్ణంరాజు తెలిపారు. మంగళ, బుధవారంల్లో స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లు, గ్రామ మహిళా సమైఖ్య లీడర్లకు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు.

జూనియర్ అసిస్టెంట్‌గా శరణ్య

నరసాపురం రూరల్: నరసాపురం మండల పరిషత్ కార్యాలయ జూనియర్ సహాయకురాలిగా కలవగుంట శరణ్య సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ప్రభుత్వం ఇటీవల ఇచ్చిన కారుణ్య నియామక ఉత్తర్వుల్లో భాగంగా శరణ్యను స్థానిక ఎంపీడీఓ కార్యాలయానికి కేటాయించారు. ఎంపీడీఓ రామకృష్ణంరాజును శరణ్య కలిసి అనంతరం బాధ్యతలు చేపట్టారు.

శేరేపాలెంలో వైద్య శిబిరం

మొగల్తూరు: మండలంలో శేరేపాలెం గ్రామంలో డెంగీ జ్వరాలు అధికంగా ఉన్నట్టు తమకు సమాచారం అందడంతో సోమవారం వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్టు మొగల్తూరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు దినేష్ తెలిపారు. తహసీల్దార్ కె.రాజకిశోర్, ఎంపీడీఓ త్రిశూల పాణిలు గ్రామంలో పర్యటించారని, పారిశుద్ధ్య నివారణకు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారని చెప్పారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

నరసాపురం: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆదేశాల మేరకు ఈనెల 14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్టు నరసాపురం గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పీఎస్ త్రినాథ్, లైబ్రేరియన్ కేజేఎస్ఎల్ కుమారి తెలిపారు. 14వ తేదీన జెండా ఆవిష్కరణ చేసి ఉత్సవాలను ప్రారంభిస్తామని చెప్పారు. 20వ తేదీ వరకు నిత్యం వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. వారోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

ద్విచక్ర వాహనాలపై భద్రాచలం యాత్ర


మద్ది ఆంజనేయ స్వామి ఆలయం వద్ద సీతారామ భక్తాంజనేయ భక్త బృందం

యలమంచిలి: దొడ్డిపట్ల గ్రామానికి చెందిన శ్రీ సీతారామ భక్తాంజనేయ భక్త బృంద సభ్యులు సోమవారం తెల్లవారుజామున 70 ద్విచక్ర వాహనాలపై ర్యాలీగా భద్రాచలం వెళ్లారు. బూరుగుపల్లి సొసైటీ కార్యదర్శి పడాల వెంకటరమణ ఆధ్వర్యంలో నందమూరిగరువు ఆంజనేయస్వామి, ద్వారకా తిరుమల వెంకటేశ్వరస్వామి, తూర్పు యడ్లవల్లి సీతారామస్వామి, మద్ది ఆంజనేయస్వామి, గుబ్బల మంగమ్మ ఆలయాల మీదుగా భద్రాచలం యాత్ర చేరుకుంది. మంగళవారం సీతారాములను దర్శనం చేసుకుని తిరిగి ప్రయాణమవుతామని, హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా ప్రతి ఏటా నిర్వహించే ఈ ర్యాలీని ప్రారంభించి 25వ సంవత్సరాలు పూర్తయిందని వెంకటరమణ తెలిపారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ యలమంచిలి మండల కార్యదర్శి దివి ప్రకాష్, భజరంగదళ్ సభ్యులు వాస్కూరి త్రిమూర్తులు, వాస్కూరి శ్రీనివాస్, కరణం సత్యనారాయణ, చిట్టూరి రాము తదితరులు పాల్గొన్నారు.